నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, బుధవారం 11 డిసెంబర్ 2024 | SURYAPET

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్

పంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

సూర్యాపేట, డిసెంబర్ 10 : గ్రామ పంచాయతీ ఎన్నికలను సజావుగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీల సహకరించాలని సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్ కోరారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోసం ఉపయోగించే పోలింగ్ స్టేషన్లపై రాజకీయ పార్టీ ప్రతినిధులు సలహాలు, సూచనలు, అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. పోలింగ్ కేంద్రాలు అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో తప్పులు, డబుల్ ఎంట్రీ లేకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు.

సమావేశంలో డీపీఓ నారాయణరెడ్డి, డీఆర్డీఓ అప్పారావు, ఎన్నికల సూపరిండెంట్ శ్రీనివాస రాజు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు సత్యనారాయణ, రాజేశ్వరరావు, అబిద్, కోటగోపి, కిరణ్, రమేశ్ పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్

అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నీలగిరి, డిసెంబర్10 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ నెల 15,16 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-2 పరీక్షల కోసం 29,118 మంది అభ్యర్థులు హాజరుగుతున్నారని, అందుకోసం 87 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో 59 కేంద్రాల్లో 21,777, మిర్యాలగూడలోని 28 కేంద్రాల్లో 7,941 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందుకోసం ముగ్గురు రీజనల్ కోఆర్డినేటర్స్, 99 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 31 మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్, 17 మంది జాయింట్ రూట్ ఆఫీసర్లు, 244మంది ఐడెంటిఫికేషన్ అధికారులను నియమించినట్లు చెప్పారు. రెండు రోజులపాటు స్థానిక సెలవులుగా ప్రకటించినట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 10 నుంచి 12.30 నిమషాల వరకు మధ్యాహ్నం 3 నుంచి 5.30 నిమిషాల వరకు రెండు సెషన్‌లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర నారాయణ అమిత్, డీఆర్ఓ అమరేందర్, డీఎస్పీలు, మున్సిపల్ కమిషనర్లు ఉన్నారు.

సెట్విన్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నీలగిరి, డిసెంబర్10 : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నల్లగొండ జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో వివిధ కోర్సులు నేర్పించడానికి నైపుణ్యత కలిగిన ఉపాధ్యాయులు ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని సెట్విన్ కోఆర్డినేటర్ మల్యాల సరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాషన్ డిజైనింగ్‌కు ఫ్యాషన్ డిజైనింగ్‌లో డిప్లొమా లేదా ఏదైనా విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ.. బ్యూటీషియన్ కోర్సుకు బ్యూటీషియన్‌లో డిప్లొమా లేదా ఏదైనా విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ.. అర్ అండ్ ఏసీకి పాలిటెక్నిక్ లేదా ఇంజినీరింగ్.. మొబైల్ సర్వీసింగ్‌కు మొబైల్ సర్వీసింగ్‌లో డిప్లొమా లేదా ఏదైనా విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ.. ఎలక్ట్రీషియన్‌కు డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్.. ప్లంబింగ్‌కు డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్.. కంప్యూటర్‌కు ఎంసీఏ, ఎంఎస్సీ(కంప్యూటర్), బీఎస్సీ కంప్యూటర్.. ఆటోమొబైల్‌కు డిప్లొమా ఇన్ ఆటోమొబైల్‌లో ఉత్తీర్ణత ఉన్న వారు నేరుగా ఈ నెల 18లోగా సంప్రదించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెట్విన్ శిక్షణ కేంద్రంలో ఇన్‌చార్జిని లేదా 97050 41789 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

నేడు ఏకసభ్య విచారణ కమిషన్ రాక

నీలగిరి, డిసెంబర్10 : ఎస్సీ వర్గీకరణ కోసం ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య విచారణ కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్ బుధవారం నల్లగొండకు వస్తున్నట్లు కలెక్టర్ ఇలాత్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో బహిరంగ విచారణ సందర్భంగా కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు షెడ్యూల్ కులాల సంఘాల నాయకుల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని షెడ్యూల్ కులాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

ఎంజీయూ బీఈడీ ద్వితీయ సెమిస్టర్ ఫలితాలు వెల్లడి

రామగిరి, డిసెంబర్ 10: ఎంజీయూ పరిధిలోని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2023-25 బ్యాచ్ బీఈడీ విద్యార్థుల 2వ సెమిస్టర్ రెగ్యులర్, 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు సీఈఓ ఉపేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

తెలంగాణ తల్లికి క్షీరాభిషేకాలు

కాంగ్రెస్ సర్కారు నిర్వాకానికి బీఆర్ఎస్ నిరసన

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించిన శ్రేణులు
- కొత్త విగ్రహంలో బతుకమ్మ తొలగింపు, చెయ్యి గుర్తు పెట్టడంపై ఆగ్రహం
- మలిదశ తెలంగాణ ఉద్యమ తల్లే తమ తల్లి అని స్పష్టీకరణ
- సోషల్ మీడియాలో డీపీలుగా తెలంగాణ తల్లి ఫొటోలు

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్10(నమస్తే తెలంగాణ) : భవ్యంగా, దివ్యంగా, దేవతామూర్తిని తలపిస్తూ చూడగానే చేతులెత్తి దండం పెట్టేలా ఉద్యమ కాలంలో కవులు, కళకారులు, సాహితీవేత్తల పర్యవేక్షణలో రూపుదిద్దుకున్న అచ్చ తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడంపై బీఆర్ఎస్ శ్రేణులు, ఉద్యమకారులు భగ్గుమన్నారు. కేసీఆర్ దీక్ష ఫలించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన వెలువడిన చారిత్రాత్మక విజయ్ దివస్ రోజు ప్రతిష్టను మసకబార్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త విగ్రహాన్ని ప్రతిష్టించడాన్ని తీవ్రంగా తప్పు పుడుతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులు, ఉద్యమకారులు తెలంగాణ తల్లి విగ్రహాలు, చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాలన్నింటినీ ఈ సందర్భంగా ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. విగ్రహాలను శుభ్రపరిచి, పూలతో అలంకరించి పాలతో అభిషేకం నిర్వహించారు. మిగతాచోట్ల తెలంగాణ తల్లీ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఉద్యమ కాలంలో రూపుదిద్దుకున్న తెలంగాణ తల్లినే అంగీకరిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తెలంగాణ వ్యతిరేక చర్యలను సహించబోమని నినాదాలు చేశారు. మునుగోడులో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో పెద్దఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు క్షీరాభిషేకంలో పాల్గొన్నాయి. బస్టాండ్ ఆవరణలో ఉద్యమ సమయంలో ప్రతిష్టించిన తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి పాలతో అభిషేకం చేశారు. నందికొండలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీతో బీఆర్ఎస్ శ్రేణులు పెద్దసంఖ్యలో తెలంగాణ తల్లి విగ్రహం వద్దకు చేరుకున్నారు. తెలంగాణ తల్లికి పూలమాలలు వేసి క్షీరాభిషేకం చేశారు. మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ శ్రేణులు తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశాయి. 'తెలంగాణ తల్లికీ జై.. అమరవీరులకు జోహార్లు, కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశాయి. మర్రిగూడ, చండూరు, ఘట్టుప్పల్, పుట్టపాక, శాలిగౌరారం మండలం చిత్తలూరులో తెలంగాణ తల్లి విగ్రహాలు, ఫ్లెక్సీలకు బీఆర్ఎస్ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఉద్యమ కాలంలో రూపుదిద్దుకున్న అచ్చ తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం రేవంత్‌రెడ్డి ఓర్వలేని తనానికి నిదర్శనమని మండిపడ్డారు. తిరిగి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యమకాలం నాటి తెలంగాణ తల్లి విగ్రహాన్నే ప్రతిష్టించి తీరుతామన్నారు. ప్రజల జీవితాలు మార్చడానికి బదులు విగ్రహాలను, పేర్లను మార్చడంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం సరిపెడుతన్నదని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నోముల భగత్‌లు ఎద్దేవా చేశారు.

సూర్యాపేటలో తెలంగాణ తల్లి ఫ్లెక్సీతో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ శ్రేణులు

సూర్యాపేట జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ర్యాలీలు తీస్తూ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఉద్యమ సమయంలో అన్ని వర్గాల ఆమోదంతో ఆవిష్కరించిన తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయకుడు వై.వెంకటేశ్వర్లు తదితరులు వందలాది మందితో బైక్ ర్యాలీ నిర్వహించి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి క్షీరాభిషేకం చేశారు. నేరేడుచర్ల, పాలకవీడు, మద్దిరాల, నూతనకల్, చివ్వెంల, హుజూర్‌నగర్, తుంగతుర్తి మండలాల్లోనూ కార్యక్రమాలు చేపట్టారు.

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గుండ్లగూడెంలో నిర్వహించిన క్షీరాభిషేకంలో మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, భువనగిరిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, చౌటుప్పల్ పట్టణంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. భువనగిరిలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యక్రమంలో అసెంబ్లీ పరిధిలోని నేతలంతా పెద్దఎత్తున పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతికి చిహ్నమైన బతుకమ్మను తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బతుకమ్మను తొలగించి, చెయ్యి గుర్తును పెట్టడం ఏంటని మండిపడ్డారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ తల్లిని అంగీకరించేది లేదని కుండబద్ధలు కొట్టి చెప్పారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు సోషల్ మీడియా, వాట్సాప్‌లో తెలంగాణ తల్లి ఫొటోలను డీపీగా పెట్టుకోవడం కనిపించింది

హాలియాలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల భారీ బైక్ ర్యాలీ


మునుగోడులో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

ఆలేరులో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి, విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

పోలీస్ స్టేషన్‌లా.. కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలా?

- కేటీఆర్‌తో కలిసి 50 వేల మందితో ధర్నా చేస్తాం
- బీఆర్ఎస్ నాయకుల జోలికి వస్తే సహించేది లేదు
- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి

ఆలేరు టౌన్, డిసెంబర్ 10 : ఆలేరు నియోజకవర్గంలోని పోలీస్ స్టేషన్లు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లా మారాయని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి మండిపడ్డారు. ఆలేరు పట్టణ కేంద్రంలోని బహదూర్‌పేట మాజీ సర్పంచ్ జంపాల దశరథపై పోలీసులు అక్రమ కేసులు పెట్టారని స్థానిక బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి వారు నిరసన తెలిపారు.అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో, ఆ పార్టీ నేతలకు పోలీసులకు తొత్తులుగా మారి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. గోశాలపై పలువురితో దాడికి పాల్పడిన కూళ్ల నర్సింహులుపై పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్ జంపాల దశరథ ఫిర్యాదు చేయగా, తిరిగి దశరథపైనే పోలీసులు కేసు నమోదు చేసి రాత్రి 2 గంటల వరకు స్టేషన్‌లో నిర్బంధించడం దుర్మార్గమన్నారు. ఫిర్యాదు చేస్తే పూర్తి స్థాయి విచారణ చేపట్టకుండా నర్సింహులు భార్యను చెయ్యి పట్టి లాగాడని దశరథపై పోలీసు కేసు పెట్టడం అప్రజాస్వామికమన్నారు. బీఆర్ఎస్ శ్రేణులను టార్గెట్ చేసి పోలీసులు దౌర్జన్యాలు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.తెలంగాణ ఉద్యమం నుంచి వచ్చిన వాళ్లమని.. కేసులకు, జైళ్లకు భయపడే పార్టీ బీఆర్ఎస్ కాదని స్పష్టం చేశారు. పోలీసులకు జీతాలు ప్రజలు ఇస్తున్నారు, కాంగ్రెస్ పార్టీ కాదని గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. ఏసీపీ రమేశ్, సీఐ కొండల్‌రావు బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. నియోజకవర్గంలో ఏ పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా కాంగ్రెస్ పైరవీకారులే కనిపిస్తున్నారని విమర్శించారు. గోశాలపై దాడికి పాల్పడిన వారిపై వారం రోజుల్లో చర్యలు తీసుకోకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి 50వేల మంది కార్యకర్తలతో ధర్నా చేస్తామని హెచ్చరించారు. కాటేపల్లి మాజీ సర్పంచ్ మంత్రి రాజును ఏసీపీ రమేశ్ పోలీస్ స్టేషన్‌కు పిలిచి కేసులు పెడతానంటూ రెండు సార్లు హెచ్చరించారన్నారు. గ్రామంలో టైర్ల కంపెనీ పెడితే వాతావరణం కాలుష్యం అవుతుందని అడ్డుకుంటే కేసు పెడుతామని ఏసీపీ బెదిరించడం విడ్డూరంగా ఉందన్నారు. అంతకుముందు తెలంగాణ తల్లి చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పుట్ట మల్లేశంగౌడ్, యాదగిరిగుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, ఆలేరు గంగుల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ మొగాలగాని మల్లేశం, వైస్ చైర్మన్ చంద్రకళ, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గ్యాదపాక నాగరాజు, పోరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కాసగళ్ల అనసూయ, కౌన్సిలర్ బేతి రాములు, మాజీ సర్పంచ్‌లు ఆరుట్ల లక్ష్మీపతిరెడ్డి, ఏసిరెడ్డి మహేందర్‌రెడ్డి, జంపాల దశరథ, బీఆర్ఎస్ నాయకులు కొలుపుల హరినాథ్, కందుల రామన్న, పాశికంటి శ్రీనివాస్, ఆడెపు బాల స్వామి, పంతం కృష్ణ, దయ్యాల సంపత్, ఎండీ ఫయాజ్, పూల శ్రవణ్, కటకం బాలరాజు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లపై నిర్బంధం

ఎక్కడికక్కడ అరెస్టులు

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్10(నమస్తే తెలంగాణ) : కనీస వేతనాలు చెల్లించాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్ల యూనియన్ మంగళవారం చలో హైదరాబాద్‌కు పిలుపునివ్వగా, పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. కొద్దిరోజులుగా దశలవారీగా ఆందోళన చేస్తున్న ఆశ వర్కర్లు పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు తరలివెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసులు వారిని సీఐటీయూ నాయకులతోపాటు ముందస్తుగా అరెస్టు చేసి ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఒక్కరు కూడా చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనకుండా కట్టుదిట్టమైన నిఘా పెట్టారు. దాంతో ఆయా మండలాల వారీగా యూనియన్ నేతలను, వారి ద్వారా ఇతరుల సమాచారాన్ని సేకరించి ఇండ్ల వద్దే అదుపులోకి తీసుకున్నారు. వారందరినీ మండలాల్లోని స్థానిక పోలీసు స్టేషన్లలో మధ్యాహ్నం వరకు ఉంచి సాయంత్రం వదిలి పెట్టారు. నల్లగొండ, తిప్పర్తి, మాడ్గులపల్లి, మిర్యాలగూడ, మునుగోడు, కట్టంగూరు, దామరచర్ల, త్రిపురారం, హాలియా, చండూరు, కేతేపల్లి, కనగల్, నార్కట్‌పల్లి, దేవరకొండ, నకిరేకల్, చిట్యాల, నిడమనూరు, గుర్రంపోడు ఇలా దాదాపు అన్ని మండలాల్లో ఆశ వర్కర్లపై పోలీసుల నిర్బంధకాండ కొనసాగింది. ఆశ వర్కర్ల అక్రమ అరెస్టులను సీఐటీయూ నేతలు తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే ఆశ వర్కర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ నేతలు హామీలు ఇచ్చి, ఇప్పుడు గద్దెనెక్కాక పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలు వెంటనే ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో దీర్ఘకాలిక పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు.

మునుగోడు పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఆశ వర్కర్లు

నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

రేవంత్‌రెడ్డి హామీ నిలబెట్టుకోవాలి

- కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

రామగిరి, డిసెంబర్ 10 : అసెంబ్లీ ఎన్నికలకు ముందు నాటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్రశిక్ష ఉద్యోగులు సమ్మెకు దిగారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, తమను రెగ్యులర్ చేయాలని కోరారు. సమస్యలు పరిష్కారించాలని , సీఎం రేవంత్‌రెడ్డి తమకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టి నిరవధిక సమ్మెలో భాగంగా ఈ మేరకు మంగళవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ఆ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెకు దిగారు. గతంలో రేవంత్‌రెడ్డి వారి వద్దకు వచ్చి మద్దతు తెలిపి మాట్లాడిన ఫొటోలను, హామీలు ఇచ్చిన న్యూస్ పేపర్ క్లిపింగ్‌లను ప్లెక్సీలపై ప్రదర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మొలుగూరి కృష్ణ మాట్లాడుతూ సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని గత నెల 18న అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. 15 రోజుల్లో స్పందించకపోతే డిసెంబర్ 10నుంచి సమ్మెకు వెళ్తామని తెలిపినట్లు పేర్కొన్నారు. విద్యాశాఖ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లి ప్రభుత్వ పాఠశాల విద్య అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్న తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమ్మెలో విద్యాశాఖ సమగ్ర శిక్షలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంజీయూలో హోరా హోరీగా ఖోఖో

రామగిరి, డిసెంబర్ 10 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో మంగళవారం వర్సిటీ పురుషులు, మహిళ జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు హోరాహోరీగా ఉత్కంఠ భరితంగా ఆడారు. ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ హరీశ్‌కుమార్ మాట్లాడుతూ ఎంపికైన జట్లలో మహిళా టీమ్ ఈ నెల 28 నుంచి 31 వరకు యూనివర్సిటీ ఆఫ్ క్యాలికట్‌లో జరిగే సౌత్ జోన్ జాతీయ పోటీలు, పురుషుల జట్టు 23 నుంచి 31 వరకు తమిళనాడులోని యూనివర్సిటీ ఆఫ్ తమిళనాడులో జరిగే సౌత్ జోన్ జాతీయ ఖోఖో పోటీలకు వెళ్తారని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కోఆర్డినేటర్ డాక్టర్‌చింత శ్యాంసుందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.మురళి, డాక్టర్ వై.శ్రీనివాస్‌రెడ్డి, సెలెక్షన్ కమిటీ సభ్యులు రాజీవ్ గాంధీ, మనోజ్‌కుమార్, ఉమ్మడి జిల్లాలోని వివిధ కళాశాల పీడీలు పాల్గొన్నారు.

ఎంజీయూ ఖోఖో జట్టుకు ఎంపికైన ఉమ్మడి జిల్లాలోని వివిధ కళాశాల విద్యార్థులు